సాక్షి

పార్వతీపురం మన్యం

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



మరీ ఇంత అలసత్వమా..?

గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయడంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. దీంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు.

- 8లో



మళ్లీ మింగేస్తారా..?

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులపై టీడీపీ నేతల కన్నుపడింది. గ్రామాల్లో వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం నిధులు బొక్కేందుకు కసరత్తు మొదలైంది.

- 8లో



రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు ఇదే

జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టును ఎంపికచేశారు.

- 8లో

రైతన్నకు రిక్తహస్తం

- కేంద్రసాయమే తప్ప.. అందని రాష్ట్ర సాయం
- రైతుల ఖాతాలకు 'పీఎం కిసాన్' రెండో విడత నిధులు జమ
- పెట్టుబడి సాయంపై నేటికీ ప్రకటన చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న చంద్రబాబు
- గత ప్రభుత్వంలో ఏకకాలంలో పీఎం కిసాన్‌తోపాటు రైతుభరోసా నిధులు జమ
- ఆవేదనలో రైతాంగం



ఇప్పటివరకు రైతన్నకు అందిన కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి సాయం రూ.4వేలు



రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి సాయం 0



వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద విడుదలైన నిధులు		
సంవత్సరం	రైతు కుటుంబాలు	జమైన నిధులు (రూ.కోట్లలో)
2019–20	1,07,729	145.43
2020–21	1,29,027	174.19
2021–22	1,34,657	181.79
2022–23	1,39,505	188.050
2023–24	1,46,016	196.236
ఈ ఏడాది పీఎం కిసాన్ కింద విడుదలైన మొత్తం		
మాసం	రైతుల సంఖ్య	విడుదలైన మొత్తం
జూన్–2024	1,13,865	రూ.22.77 కోట్లు
అక్టోబరు–2024	1,14,228	రూ.22.85 కోట్లు

నాయకుడంటే ఓ నమ్మకం. ఆయన ఏ హామీ ఇచ్చినా అమలుచేస్తారని జనం నమ్ముతారు. దానికోసం ఆశగా ఎదురుచూస్తారు. ప్రస్తుతం రైతన్నకు ఇచ్చిన ఒక్కహామీని కూడా చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేయకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ చివరిదశకు వచ్చినా పెట్టుబడిసాయం అందించకపోవడంపై గగ్గోలు పెడుతున్నారు. ఓ వైపు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పైసా నిధులు విదల్చకపోవడంపై మండిపడుతున్నారు. సీఎం చంద్రబాబుకు మోసం చేయడం తప్ప మేలుచేయడం తెలియదని దుయ్యబడుతున్నారు.

సాక్షి, పార్వతీపురం మన్యం: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికీ రైతులను ఆదుకునే పెట్టుబడి సాయంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పీఎం కిసాన్ రెండో విడత మొత్తాన్ని శనివారం రైతుల ఖాతాలకు జమ చేసింది. ఏడాదికి రూ.20 వేలు రైతులకు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇప్పటికీ రూపాయి కూడా విదల్చలేదు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నుంచి తొలివిడత సాయంగా గత జూన్ నెలలో ఖరీఫ్ ప్రారంభంలో రైతుల ఖాతాలకు రూ.2 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ మొత్తం కాస్త ఉపయోగపడింది. జిల్లాలో 1,13,865 మంది రైతులకు రూ.22.77 కోట్లు బ్యాంకు ఖాతాల్లో మొదటి విడతగా జమయ్యాయి. తాజాగా శనివారం మరో విడత నిధులను ప్రధాని మంత్రి నరేంద్రమోదీ మహారాష్ట్రలో విడుదల చేశారు. జిల్లాలో ఈ విడత 1,14,228 మంది లబ్ధిదారులకు రూ.22.85 కోట్లు జమయ్యాయి. ఈ మొత్తం కేంద్ర వాటా కాగా.. రాష్ట్ర ప్రభుత్వ సహాయం కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

నాడు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వెనువెంటనే సాయం

సాగు పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందిస్తూ వారికి అండగా నిలిచేవారు. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తం అందించేవారు. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతల సమయం, రబీ ఆరంభంలోగానీ, ధాన్యం ఇంటికి చేరే వేళ గానీ మూడు విడతలుగా అందించేవారు. వైఎస్సార్ రైతుభరోసా– పీఎం కిసాన్ కింద ఐదేళ్లలో జిల్లాలోని రైతులకు 885.69 కోట్లను అందించారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించగా.. ఎటువంటి భూమీ లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలురైతులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్‌బోర్డు భూములను సేద్యం చేస్తున్న కౌలురైతులకూ వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించేది. ఏటా మే నెలలోనే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడత సాయం విడుదల చేసేది. దాంతోపాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 సాయాన్ని రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేసేవారు. పెట్టుబడులకు ఈ సాయం ఎంతగానో ఉపయోగపడేది.

చేతి మదుపులు పెట్టుకోవాల్సిందే..

వ్యవసాయమంటేనే చేతిమదుపులతో ప్రారంభం అవుతుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతు పంట పండించేందుకు ఎకరాకు కనీసం రూ.13 వేల వరకు పెట్టుబడి అవసరం. తొలుత పంట వేసేందుకు భూమి సిద్ధం చేయాలంటే సుమారుగా మూడు దుక్కులు చేయాలి. ఎకరాలో గంట సమయం ట్రాక్టర్‌తో దుక్కి చేసేందుకు రూ.1500 చెల్లించాల్సి వస్తోంది. డిమాండ్‌కు అనుగుణంగా ఈ ధర పెరుగుతుంది. మూడు దశల్లో దుక్కి చేపట్టడానికి దాదాపుగా రూ.4,500 పెట్టుబడి పెట్టాలి. గట్లు వేసేందుకు, కలుపు తీసేందుకు సగటు వేతనదారు కూలి రూ.300 నుంచి 500 వరకు అవుతోంది. ఇక్కడ కూడా రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పొలం గట్లపై గాబు మందు వేసేందుకు మరో రూ.1500 ఖర్చు చేయాలి. వెదలు జల్లితే ఎకరాకు రూ.600 వరకు ఒక వేతనదారు వంతున ఇద్దరికి చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో దుక్కి కూడా అవసరం ఉండటంతో మరో రూ.2 వేలు ఖర్చు చేయాలి. పంట వేసిన 15 రోజుల్లోగా కలుపు నివారణ మందులకు వెచ్చించాలి. నారుమడులు సిద్ధం చేసి బురద దుక్కి దున్ని వేతనదారులతో నాట్లు వేయించాలంటే దాదాపు రూ.8వేలు పైబడి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన సగటు రైతు పెట్టుబడులకే చేతిలో సొమ్ము లేక అప్పుల వైపు అడుగులు వేస్తున్నాడు. ఈ దశలో ప్రభుత్వం సాయమందిస్తే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండదు. వ్యవసాయం జూదంగా మారుతున్న ఈ తరుణంలో ప్రభుత్వ సాయం కూడా అంతంతమాత్రంగానే ఉంటే.. పూర్తిగా పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు అంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదు విడతల్లో ఏటా మే నెలలోనే రైతు భరోసా పేరిట రూ.7,500లు అందించేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదంటూ వాపోతున్నారు.

ఏటా రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం..

ఖరీఫ్ సీజన్ మొదట్లో విత్తనాల కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతున్నాయి. ప్రస్తుతం పొట్టదశ, వెన్ను దశలో వరి ఉంది. తెగుళ్లు సోకితే మందులకు ఖర్చు పెట్టాలి. గతంలో పీఎం కిసాన్‌తోపాటు.. రైతు భరోసా ఒకేసారి అందడంతో పెట్టుబడి ఖర్చు కింద ఆ మొత్తం ఉపయోగపడేది. ఇప్పుడు పీఎం కిసాన్ కింద రూ.2 వేలు మాత్రమే అందుతుండటంతో ఆ మొత్తం ఎటూ చాలదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఐదు దస్త్రాలపై సంతకాలు చేశారు. రైతుల పెట్టుబడి సాయంపై మాత్రం సంతకం లేదు. ఇప్పటి వరకు దానిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం ఎప్పుడా అని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సాగుకు లేదు భరోసా



నా పేరు ఆలవట్టం శ్రీనివాసరావు. మక్కువ గ్రామం. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో బ్యాంకు ఖాతాకు రూ.4వేలు జమచేసింది. ఖరీఫ్ చివరి దశకు చేరుకున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేలలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. రైతన్నకు సాగుభరోసా కరువైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతుభరోసా కింద రైతుల ఖాతాలకు జమయ్యేది. సాగుకు సాయం అందేది. తక్షణమే పెట్టుబడి సాయం అందజేసి రైతులను ఆదుకునేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

సాయం అందించండి



పీసీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.2వేలు చొప్పున రూ.4వేలు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందజేయాల్సిన రూ.14వేలలో కనీసం ఒక్కరూపాయి కూడా అందించకపోవడం దారుణం. వ్యవసాయమంటేనే పెట్టుబడితో కూడినది. దీనిని ప్రభుత్వం గుర్తించి తక్షణమే నిధులు విడుదల చేయాలి.

– వంగల ఈశ్వరరావు, రైతు, కందివలస గ్రామం, కొమరాడ మండలం

ఇంకా ఎన్నాళ్లకు?



ఖరీఫ్ పంట కాలం చివరి దశకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూపాయి పెట్టుబడి సాయం అందలేదు. ఇంకా ఎన్నాళ్లు ఎదురు చూడాలో తెలియడంలేదు. సాగుకు పెట్టుబడి లేక ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం. గత ప్రభుత్వ హయాంలో ఏటా వ్యవసాయ సీజన్ కంటే ముందుగా రైతు భరోసా నిధులు నేరుగా అన్నదాతల బ్యాంకు ఖాతాలకు జమయ్యేవి.

– ఎస్.విజయ్‌కుమార్, కోటిపల్లి, రైతు

న్యూస్‌రీల్

అన్నపూర్ణ దేవిగా కోటదుర్గమ్మ



అన్నపూర్ణదేవి అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ వారు దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఒక్క దరఖాస్తు రాలేదు..!



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి

పాలకొండ రూరల్: పాలకొండ నియోజకవర్గ పరిధిలో నూతన మద్యం దుకాణాల టెండర్లకు సంబంధించి పాలకొండ ఎక్సైజ్ శాఖ పరిధిలో స్వీకరించిన దరఖాస్తులపై సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌రెడ్డి శనివారం ఆరా తీశారు. ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడి అధికారులతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలో జనాభా ప్రాతిపదికన నాలుగు మండలాలకు 11 దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందని, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై మూడు రోజులు గడిచినా ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు వివరించారు.

నాన్నా నేను ఇంటికి వస్తున్నా అంటూ అనంతలోకాలకు...



గెంబలి పద్మావతి(ఫైల్)

పాలకొండ రూరల్: నాన్నా.. నేను ఇంటికి వస్తున్నా.. మరి కొద్ది సేపటిలో కత్తిపూడి కూడలి నుంచి బయలుదేరుతున్నా అంటూ శనివారం ఉదయం 8 గంటల సమయంలో ఫోన్ చేసిన కుమార్తె రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలు వెళ్లిపోయింది. ఈ వార్త విన్న ఆ తండ్రి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకు చెందిన గెంబలి శ్రీనివాసరావు, నాగమణి దంపతుల కుమార్తె పద్మావతి(18) కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రుల పిలుపు మేరకు దసరా పండడకు ఇంటికి బయలుదేరింది. కత్తిపూడి మీదుగా బస్సులో వస్తానని తండ్రికి ఫోన్‌లో సమాచారం అందించింది. పద్మావతి బస్టాప్‌కు బైక్‌పై వస్తుండగా గొల్లప్రోలు హైవేపై ఐచర్ వ్యాన్ ఢీ కొనడంతో తల భాగంలో తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుమార్తెను ఉన్నత చదువులు చదివించాలన్న ఆ తండ్రి ఆశను మరో వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం ఛిదిమేసింది. కన్న కూతురు భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లికి కడుపుకోత మిగిలింది. చెల్లెలు మరణవార్త విని అన్నయ్య సంజీవి గుండెలు బాదుకున్నాడు. ఈ ఘటనలో వాహనంపై లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి కూడా మరణించారు. ఈ వార్త పట్టణంలో విషాదాన్ని నింపింది. మృతదేహాన్ని స్వగృహానికి చేర్చేందుకు బంధువులు గొల్లప్రోలు పయనమయ్యారు.

గోగు ఊరవేతలో రైతులు బిజీ



పెద్దూరులో గోగు పంటను ఊరవేస్తున్న రైతులు

గరుగుబిల్లి: గోగు ఊరవేత పనుల్లో మండల రైతులు బిజీ అయ్యారు. పెద్దూరు, గరుగుబిల్లి, గొట్టివలస, ఉల్లిబద్ర తదితర గ్రామాల్లో సుమారు 350 ఎకరాల్లో రైతులు గోగు పంటను సాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటను కోసి చెరువుల్లో ఊరవేస్తున్నారు. అయితే, గోగు పంటను కోసేందుకు ఎకరాకు రూ.4వేల నుంచి రూ.4,500 పెట్టుబడి అవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఊరవేతకు చెరువుల్లో సమృద్ధిగా నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు.

కదిలిన యంత్రాంగం



వైద్యశిబిరం వద్ద మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి, జేసీ శోభిత, తదితరులు

- అదుపులోకి రాని డయేరియా
- కొత్తగా మరో ఐదు కేసుల నమోదు
- విశ్వనాథపురంను సందర్శించిన మంత్రి సంధ్యారాణి, జేసీ శోభిత
- ఆందోళనలో గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్

పాచిపెంట: మండలంలోని విశ్వనాథపురంలో డయేరియా అదుపులోకి రాలేదు. తాజాగా శనివారం మరో ఐదు కేసులు నమోదయ్యాయి. వీరిలో ఒకరిని వైద్యం కోసం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన 25 మంది డయేరియా బారిన పడడం, వీరిలో 9 మందిని మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని వివిధ ఆస్పత్రులకు తరలించే అంశంపై 'డయేరియాతో మంచం పట్టిన విశ్వనాథపురం' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన వార్తకు అధికారులు, పాలకులు స్పందించారు. స్త్రీ శిశు సంక్షేమశాఖమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జేసీ శోభిత, ఇన్‌చార్జి డీపీఓ రామచంద్రరావు తదితరులు గ్రామాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. గ్రామంలో డయేరియా ప్రబలడానికి గల కారణాలపై మంత్రి ఆరా తీశారు. పారిశుద్ధ్యపనులతో పాటు తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

43 మద్యం దుకాణాలకు 117 దరఖాస్తులు

- ఆదివారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తాం
- పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన
- స్పష్టం చేసిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్



పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీకి ఇప్పటివరకు జిల్లాలో 117 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం సీతానగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి ఒక దరఖాస్తును స్వీకరించి, ప్రక్రియను పరిశీలించారన్నారు. జిల్లాలో 52 మద్యం షాపులకు దరఖాస్తులను కోరగా ఇప్పటివరకు 43 షాపులకు మాత్రమే దరఖాస్తుదారులు తమ దరఖాస్తులు సమర్పించారన్నారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్దేశించిన రూ.2 లక్షలు (నాన్ రిఫండబుల్) రుసుమును చెల్లించి తమ దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. అక్టోబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లాలోని పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు వివరించారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రలోభాలను, పుకార్లను నమ్మవద్దు

జిల్లాలో నూతన మద్యం పాలసీ చాలా పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో ఎటువంటి ప్రలోభాలను, పుకార్లను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తులను అక్టోబర్ 11వ తేదీన కలెక్టర్ సమక్షంలో డ్రా తీయడం జరుగుతుందని, డ్రాలో వచ్చిన దరఖాస్తుదారునికే షాపులను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించి తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

తమ్ముళ్ల 'మత్తు' మంత్రం..

ఒత్తిళ్ల తంత్రం

- రూ.కోట్లు కొల్లగొట్టేందుకు కాచుకొని కూర్చున్న సిండి'కేట్లు'!
- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 205 మద్యం దుకాణాలు
- గరిష్ట సంఖ్యలో దుకాణాలను గుప్పిట పట్టేందుకు సిండికేట్‌ల సన్నాహాలు
- గత టీడీపీ ప్రభుత్వ పాలన (2014–19) నాటి మద్యం వ్యాపారులే మళ్లీ హల్‌చల్
- టీడీపీ ప్రత్యక్ష, పరోక్ష సహాయసహకారాలతో జూలు విదిలిస్తున్న వైనం
- ప్రత్యర్థుల నుంచి పోటీలేకుండా వాటాల ఎర
- కొత్తవారెవ్వరూ అడుగుపెట్టకుండా భయపెట్టే ప్రచారం
- కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేల వ్యూహాత్మక మౌనం
- టెండర్లు దక్కించుకున్నవారికే టెండరు పెట్టాలని ఆలోచన

మత్తుపై పెత్తనానికి తమ్ముళ్లు మంత్రతంత్రాలకు తెరతీశారు. టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపేవారినే కాదు.. అధికారులనూ బెదిరిస్తున్నారు. దుకాణం ఎవరు దక్కించుకున్నా చివరకు తమకే అప్పగించాలని హుకుం జారీ చేస్తున్నారు. దుకాణాలు దక్కించుకునేందుకు గ్రూపులుగా ఏర్పడి హల్‌చల్ చేస్తున్నారు. రూ.కోట్ల కొల్లగొట్టేందుకు కూటమి నేతల యత్నాలను చూసిన వారు బిత్తరచూపులు చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కోట్ల రూపాయలు కళ్లజూసిన మద్యం సిండికేట్లుకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. చంద్రబాబు గత పాలన (2014–19) మాదిరిగానే ఈసారి కూడా బాగా కలిసొస్తుందనే బలమైన నమ్మకంతో బరిలోకి దిగుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలన ఐదేళ్లు మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించడంతో వారి ఆటలు సాగలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వస్తూనే మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకే అప్పగించాలని నిర్ణయించడం మళ్లీ వారికి ఊపిరిపోసింది. విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలకు అనుమతిస్తూ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ నెల 9వ తేదీలో ఆశావహులు టెండర్లు దాఖలు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున వాపస్ ఇవ్వని రుసుం నిర్ణయించారు. ఔత్సాహికుల ఆశలపై అక్కడే నీళ్లు చల్లేశారు. అదే సమయంలో పూర్వానుభవంతో సిండికేట్లు గరిష్ట సంఖ్యలో మద్యం దుకాణాలను గుప్పిటపట్టేందుకు వ్యూహరచన చేస్తున్నారు. తమ వాళ్లతోనే పరిమిత దరఖాస్తులు వేయిస్తున్నారు. ప్రత్యర్థులు పోటీరాకుండా వారికి వాటాల ఆశలు చూపిస్తున్నారు. కొత్తవారెవ్వరూ అడుగుపెట్టకుండా వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రచారానికి తెర తీశారు. రెండు లక్షల రూపాయలు పెట్టి దరఖాస్తు చేసినా సిండికేట్‌కే షాప్ వెళ్లిపోతుందని, ఎక్కడో తప్పిపోయి షాప్ దక్కినా సరకు విషయంలో సిండికేట్ దాడి తప్పదని హితోక్తులు చెప్పిస్తున్నారు. దీంతో ఔత్సాహికులు చాలావరకూ వెనక్కితగ్గిపోతున్నారు. ఇదే సమయంలో తమ అనుచరులకు మద్యం దుకాణాలు దక్కేలా కొంతమంది టీడీపీ నాయకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయసహకారాలు అందిస్తున్నారు. కొంతమంది ఈ వ్యవహారాలు దూరంగా ఉన్నామని చెబుతున్నా... తమ నియోజకవర్గంలో టెండరు ఎవరికి దక్కినా వ్యాపారం సవ్యంగా సాగాలంటే తమను ప్రసన్నం చేసుకోవాల్సిందేగా అన్నంత ధీమాలో ఉన్నారు.

టీడీపీ నాయకులదే హవా..!

విశ్వసనీయ సమాచారం ప్రకారం... విజయనగరం నియోజకవర్గంలో 16 మద్యం దుకాణాలకు పోటీ ఎక్కువగానే ఉంది. టీడీపీకి చెందిన కంది మురళీ నాయుడు, అవనాపు విజయ్ ఒక గ్రూప్‌గా, ఇటీవలే జనసేన పార్టీలోచేరిన అవనాపు విక్రమ్ అనుచరులు మరో గ్రూప్‌గా పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. రాజాం నియోజకవర్గంలో 17 దుకాణాలకు గాను ఇప్పటివరకూ 15 దరఖాస్తులే దాఖలయ్యాయి. ఆ దరఖాస్తుదారులంతా టీడీపీతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు ఉన్నవారే కావడం గమనార్హం. చీపురుపల్లి నియోజకవర్గంలో 20 మద్యం దుకాణాలకు టెండర్ల విషయంలో తాను తలదూర్చనని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తేల్చి చెప్పేసినప్పటికీ అక్కడి మండల స్థాయి టీడీపీ నాయకులు తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. బొబ్బిలి నియోజకవర్గంతో పాటు పొరుగున ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో మద్యం వ్యాపారంలో మళ్లీ కాసుల పంట పండించుకునేందుకు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి మార్గదర్శకత్వంలో సిండికేట్ సిద్ధమైనట్టు తెలిసింది. పాలకొండ నియోజకవర్గంలో 11 షాప్‌ల్లో అత్యధికం దక్కించుకోవడానికి రాజాంకు చెందిన పీతా రోకే (రామకృష్ణ) అనే మద్యం వ్యాపారి సిండికేట్‌కు తెరతీసినట్టు భోగట్టా.



అసలుకు అచ్చుగుద్దినట్లుగా నకిలీ మూతలు (ఫైల్)

28.01.2018: వీరఘట్టంలో జనతా వైన్స్ పేరుతో నిర్వహిస్తోన్న ఓ మద్యం దుకాణంలో కల్తీ సరుకు వెలుగుచూసింది. బ్రాండెడ్ మద్యం బాటిళ్ల మూతలను పోలిన నకిలీ మూతలతో మాయచేసి మందుబాబుల జేబులు ఖాళీచేసిన వైనం అప్పట్లో వెలుగుచూసింది. ఆ నకిలీ మూతలను హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున తయారీ చేయించి మరీ సిండికేట్లు సూత్రధారులే తెప్పించినట్లు దొరికిన ఆధారాలు సంచలనం సృష్టించాయి. బెల్ట్ షాపులు మూసేయిస్తానని చంద్రబాబు 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన తొలిరోజే చేసిన సంతకం ఎంతబాగా చెల్లుబాటు అయ్యిందో 2014–19 పాలనలో ప్రజలు కళ్లారా చూశారు. బెల్ట్‌షాపులు మూతపడలేదు సరికదా కల్తీ మద్యం ఏరులై పారింది. బ్రాండెడ్ మద్యం బాటిళ్లలో చీప్‌లిక్కర్, తక్కువ ఖరీదు మద్యం కల్తీ చేసి వాటికి నకిలీ మూతలను తగిలించి మందుబాబులకు సిండికేట్ల సూత్రధారులు మస్కాకొట్టారు. మూతల రంగు, టైటిల్, లెటరింగ్, లేబుళ్లు... అన్నీ మక్కికిమక్కీగా తయారుచేయడానికి హైదరాబాద్ జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఒక పరిశ్రమనే నడిపించారంటే నాటి పరిస్థితి ఊహించవచ్చు. అంతేకాదు ఈ అక్రమ మద్యం వ్యాపారానికి అండదండలు అందించినందుకు అప్పటి టీడీపీ నాయకులకు ఒక్కో దుకాణం నుంచి ప్రతి నెలా రూ.50 వేలు చొప్పున మామ్మూళ్లు చెల్లించేవారంటే మద్యం వ్యాపారులకు ఏ స్థాయిలో లాభాల పంట పండిందో ఊహించవచ్చు.

క్లుప్తంగా

బాలలను పనిలో పెడితే చర్యలు



తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె. సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను పనిలో పెట్టుకున్న ఆరుగురు దుకాణ యజమానులపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గౌరీశంకర్, ఐసీడీఎస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఓ జూట్ మిల్లులో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరాం గ్రామానికి చెందిన తొగురోతు చిన్నారావు (30) జూట్‌మిల్లులో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని వస్తుండగా... ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభానికి ప్రమాదవశాత్తూ తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేపాడ: మండలంలోని కొత్త బొద్దాం సమీపంలో విశాఖ – అరుకు రోడ్డుపై గత ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇందుకూరి లక్ష్మీపతిరాజు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై బి. దేవి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 29న ఎస్.కోట నుంచి కొత్తవలస వైపు ద్విచక్ర వాహనంపై లక్ష్మీపతిరాజు వెళ్తున్నాడు. కొత్త బొద్దాం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా... అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మంత్రి కొండపల్లి జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఎన్.ఆర్.ఐ.వ్యవహారాలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం జిల్లాకు వస్తున్నారు. ఉదయం 4.45 గంటలకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ఆయన నగరానికి చేరుకొని స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

మరీ ఇంత అలసత్వమా..?

- గర్భిణుల పేర్లు నమోదులో వెనుకబాటు..
- వైద్య తనిఖీల్లోనూ అదే తంతు
- ఆగస్టు నెలఖారు నాటికి 13,642 మంది వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి
- 11, 662 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసిన వైనం



గంట్యాడ మండలం పెదవేమలిలో గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయడంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. దీంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. గర్భిణులకు జరగాల్సిన వైద్య తనిఖీలు కూడా పూర్తి స్థాయిలో జరగడం లేదు. గర్భిణుల వివరాలు సకాలంలో నమోదు చేస్తే వారికి ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. అదే రిజిస్ట్రేషన్ చేయకపోతే చికిత్స అందక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

12 వారాల్లోగా..

గర్భం దాల్చిన 12 వారాల్లోగా గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి. రిజిస్ట్రేషన్ సమయంలోనే గర్భిణికి హెచ్‌బీ (హిమోగ్లోబిన్) పరీక్ష చేస్తారు. అలాగే టీటీ ఇంజిక్షన్, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు కూడా ఇస్తారు. రిజిస్ట్రేషన్ సయంలోనే గర్భిణి ఆరోగ్య వివరాలతో పాటు ఆధార్, ఫోన్ నంబర్, తదితర వివరాలు నమోదు చేసుకుంటారు.

నాలుగు సార్లు తనిఖీలు..

ప్రతి గర్భిణికి ప్రసవం అయ్యేలోగా నాలుగుమ సార్లు వైద్య తనిఖీలు చేయాలి. ఈ వైద్య తనిఖీలు సంబంధిత పీహెచ్‌సీ వైద్యులు చేయాల్సి ఉంటుంది. గర్భం దాల్చిన 12 వారాలకు, 16 వారాలకు, 28 వారాలకు, 32 వారాల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య తనిఖీలు చేసే సమయంలో ఏదైనా ఆరోగ్య సమస్య గుర్తిస్తే వెంటనే చికిత్స అందిస్తారు. అదేవిధంగా గర్భిణి హైరిస్క్‌లో ఉన్నట్లయితే ప్రత్యేక చికిత్స అందిస్తారు.

13,642 రిజిస్ట్రేషన్లు జరగాలి..

2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలఖారు నాటికి 13,642 మంది పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలి. కాని 11, 662 మంది వివరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో గర్భిణులకు పూర్తి స్థాయిలో వైద్య తనిఖీలు జరగలేదు. 11,662 మందికి నాలుగు సారు వైద్య తనిఖీలు చేయాల్సి ఉండగా.. 10,192 మందికి మాత్రమే నాలుగుసార్లు పరీక్షలు జరిగాయి. ఇంకా 1470 మంది వైద్య తనిఖీలు జరగలేదు.

ఆదేశించాం..

గర్భం దాల్చిన 12 వారాల్లోగా గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలిచ్చాం. అదేవిధంగా గర్భిణులందరికీ నాలుగు సార్లు తనిఖీలు చేయాలని సిబ్బందికి సూచించాం. గర్భిణుల రిజిస్ట్రేషన్, వైద్య తనిఖీల విషయంలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్ఓ

అల్లర్లు తలెత్తకుండా చర్యలు చేపట్టండి

- ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎటువంటి అల్లర్లు తలెత్తకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసే నదులు, చెరువుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఊరేగింపులు ఇతర ప్రార్థనా మందిరాల మీదుగా వెళ్లే సమయాల్లో మరికొంత జాగ్రత్తగా వ్య వహరించాలని, ఎటువంటి మత ఘర్షణలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఊరేగింపుల సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకోవాలని సూచించారు. ఈ సమయంలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎటువంటి అశ్లీలత లేకుండా చూడాలని, నిర్దిష్ట సమయం వరకు మాత్రమే ప్రదర్శనలకు అవకాశం ఇవ్వాలని స్పష్టం చేశారు.

వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: క్షయ, కుష్టు వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స ప్రారంభించాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో క్షయ, కుష్టు వ్యాధిపై పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. ఉమ్మి తుంపరల ద్వారా క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది కాబట్టి త్వరగా గుర్తించాలని సూచించారు. మందులు మధ్యలో మానేస్తే వ్యాధి తీవ్రతరం అవుతుందన్న విషయం రోగులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ ఎ.అర్చనాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



తహసీల్దార్ గోవింద్‌కు ఫిర్యాదు చేస్తున్న కోనాడ ప్రజాప్రతినిధి సురేష్

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ బస్టాండ్ సమీపంలో గల భవానీ పీఠం వద్దనున్న దేవస్థానం స్థలంలో (సర్వే నంబర్ 89/2) అక్రమ నిర్మాణం చేపడుతున్నారని గ్రామానికి చెందిన వాసుపల్లి సురేష్ తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ గోవిందను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ స్పందిస్తూ వెంటనే నిర్మాణాన్ని పరిశీలించి, నిలిపివేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇదిలా ఉంటే కోనాడ దేవస్థానం ఈఓ జగదేశ్వరి నిర్మాణాన్ని శనివారం మధ్యాహ్నం పరిశీలించి, నిర్మాణాలు చేపట్టకూడదని బాధ్యులను హెచ్చరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు





పైడితల్లి జాతరలో భాగంగా వనంగుడి వద్ద శనివారం రాత్రి విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి పాటలకు విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలను దేవదాయశాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు ఇదే

- 16,17,18 తేదీల్లో జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలు
- 7వ తేదీ నుంచి నెల్లూరులో శిక్షణ శిబిరం



అండర్–14 విభాగం రాష్ట్ర ఖోఖో జట్టు

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టును ఎంపికచేశారు. శనివారం పంగులూరులోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో అండర్–17, అండర్–14 విభాగంలో రాష్ట్ర బాలికల ఖోఖో జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలో రాష్ట్రం నలుమూల నుంచి 100 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో మంచి ప్రతిభకనబరిచిన బాలికలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 16,17,18 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఎంపికలో రాష్ట్ర రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ (కృష్ణా జిల్లా), బాపట్ల కోచ్ జే పాల్, ప్రకాశం జిల్లా కోచ్ డీఎల్ లక్ష్మీనారాయణరెడ్డి, కడప జిల్లాకు చెందిన పీడీ ఎం పవన్‌కుమార్, సోమేశ్వరరావు (కృష్ణా జిల్లా), వి రఘుబాబు (ఇడుపులపాడు), సావిత్రమ్మ (కనిగిరి), లత (శ్రీకాకుళం), రత్తయ్య (కారంపూడి), శ్రీనివాసరావు, రాంబాబు, (తూర్పుగోదావరి), కే వీరాంజనేయులు, కె రామారావు (ముండ్లమూరు), సోమశేఖర్‌రెడ్డి (ఈదర)తదితరులు పాల్గొన్నారు.

అండర్ –14 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు..

కే భవాని (నెల్లూరు), షేక్ గౌస్య (నెల్లూరు), ఎం హారిక (శ్రీకాకుళం), ఎం యువశ్రీ (చిత్తూరు), జీ చందన (శ్రీకాకుళం), ఎం చందన లక్ష్మి (విజయనగరం), ఏ హేమలత (ప్రకాశం), బీ ఐశ్వర్య (ప్రకాశం), షేక్ మనీషా (గుంటూరు), జీ హరిత (కడప), పవి గనిలక్ష్మి (తూర్పుగోదావరి), ఎస్ హారిక (విజయనగరం), కావేరి (అనంతపురం), డీ వినేష్ (కృష్ణా), హారిక (కర్నూలు), జీ గురవమ్మ (ప్రకాశం).

అండర్–17 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు..

కేకే ప్రీతి (నెల్లూరు), ఎస్ శ్రవంతి (నెల్లూరు), ఆర్ జాహ్నవి (విజయనగరం), ఏ పురందేశ్వరి (ప్రకాశం), టీ సుమతి (ప్రకాశం), కే స్వప్న (అనంతపురం), ఆర్ తనూజ (శ్రీకాకుళం), జీ భవాని (శ్రీకాకుళం), ఎస్ తేజశ్రీ (శ్రీకాకుళం), పి అర్చనశ్రీ (కర్నూలు), స్రవంతి (కడప), బీ స్వాతి (తూర్పుగోదావరి), జీ అనిత (కృష్ణా), డీ లక్ష్మి (గుంటూరు), పీ జ్యోత్స్న (విశాఖపట్నం), సత్యవతి (చిత్తూరు), మణిచంద్రిక (తూర్పుగోదావరి).



అండర్–17 విభాగం రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు



ఎంపిక పోటీలలో తలపడుతున్న బాలికలు

మళ్లీ మింగేస్తారా..?

- కూటమి నాయకులకే 'ఉపాధి' పనులు
- గతంలో కూడా నిధులు మింగేసిన టీడీపీ నాయకులు
- తాజాగా జిల్లా వ్యాప్తంగా 2199 పనులకు రూ.152 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు
- నీరు – చెట్టు పథకం మాదిరిగా నిధులు కొల్లగొట్టేందుకు టీడీపీ నేతల కార్యాచరణ
- సీసీ రోడ్లు, కల్వర్టులు, కాలువల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్



2015-18 మధ్య టీడీపీ పాలనా కాలంలో కోటశిర్లాంలో నాసిరకంగా నిర్మించిన చెక్‌డ్యామ్ దుస్థితి



ముచ్చర్లవలసలో శిథిలావస్థకు చేరిన సామూహిక మరుగుదొడ్లు

రామభద్రపురం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులపై టీడీపీ నేతల కన్నుపడింది. గ్రామాల్లో వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం నిధులు బొక్కేందుకు కసరత్తు మొదలైంది. సిమెంట్, కంకర రోడ్లకు ఉపాధి నిధులు కేటాయించి టీడీపీ నాయకులు, వారి అనుచరులకు పంచిపెట్టే చర్య ఆరంభమైంది. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి వాటి ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మించేలా విన్నపాలు స్వీకరించారు. ఈ విన్నపాల ప్రకారం జిల్లాలో 2199 పనులకు రూ.152 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేశారు. ఆయా పనులను మండలాల వారీగా గ్రామాల్లోని టీడీపీ నాయుకులకు పంచేశారు.

థర్డ్ పార్టీ వెండర్‌గా రిజిస్ట్రేషన్లు..

అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికే పనులు దక్కాయి. మెటీరియల్ కాంపొనెంట్ కింద ఉపాధి నిధులతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టెండర్లతో పని లేకుండా సాగే ఈ పనులన్నింటినీ టీడీపీ నాయుకులే చేపట్టనున్నారు. థర్డ్ పార్టీతో వెండర్ రిజిస్ట్రేషన్ చేసి వారి ద్వారా పనులు చేయించేందుకు పక్కా స్కెచ్ వేస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల వారీగా థర్డ్ పార్టీగా వెండర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

అప్పట్లో ఇలా..

2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనా కాలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు మొత్తం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలోనే సాగాయి. అయితే ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేంద్ర ప్రభుత్వానికి చెందినవైనా తమవే అన్నట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అప్పట్లో మెటీరియల్ కాంపొనెంట్ కింద చెక్ డ్యామ్‌లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చి అవినీతికి కొత్త భాష్యం చెప్పారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలతో పాటు వాటర్‌షెడ్ కార్యక్రమాల కింద 2014 సంవత్సరానికి ముందు చేపట్టిన పనులకు పైపై మెరుగులు దిద్దడంతో పాటు కొన్ని పనులు నాసిరకంగా, మరికొన్ని పనులు చేయకుండా ఉపాధి నిధులు కొల్లగొట్టారన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. అలాగే ఇప్పుడు కూడా నిధులు స్వాహా చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

మండలంలో రూ.4 కోట్లు స్వాహా..

మండలంలో 2015 – 18 మధ్య పంచాయతీరాజ్, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.6 కోట్లతో అప్పట్లో టీడీపీ నాయకులు ఉపాధి పనులు చేపట్టారు. అయితే అక్రమాలు, అవకతవకలపై అప్పట్లో విజిలెన్స్ ఎస్పీ టి. హరికృష్ణ పలు గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఉపాధి పనులు సక్రమంగా జరగలేదని, కొన్నిచోట్ల పనులు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేసినట్లు గుర్తించారు. అలాగే చెక్‌డ్యామ్‌లు, మదుములు, చప్టాలను టెక్నికల్ అనుమతుల్లేకుండా నాసిరకంగా నిర్మించారని నిర్ధారించారు. కొన్ని పనులకు సంబంధించి అధికారుల సంతకాలనే ఫోర్జరీ చేశారని తేల్చారు. రామభద్రపురం మండలంలో సుమారు నాలుగు కోట్ల రూపాయల వరకు అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. దీంతో 22 పంచాయతీలకు చెక్ పవర్ రద్దు, 24 మంది అధికారులను సస్పెండ్ చేయడంతో మండలం పేరు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా వినిపించింది.

మరుగుదొడ్లలోనూ మింగేశారు..

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి మంజూరు చేశారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ. 15 వేలు చొప్పున విడుదల చేశారు. అయితే అప్పట్లో టీడీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నాసిరకంగా నిర్మాణాలు చేపట్టి డబ్బులు దండుకున్నారు. అప్పట్లో అధికారులు కూడా అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి నిధులు మంజూరు చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మళ్లీ టీడీపీ నాయకులు పనులు చేపట్టడానికి ముందుకు వస్తుండడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పారదర్శకంగా పనులు..

ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపొనెంట్ కింద నిర్మాణాలు చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 2199 పనులకు రూ.152 కోట్ల అంచనాతో నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో ఏమి జరిగిందో తెలియదు. ప్రస్తుతం గ్రామసభల ద్వారా ఆమోదం పొందిన పనులు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. అలాగే అక్రమాలకు తావులేకుండా ఇంజినీరింగ్ శాఖాధికారులతో పనులు పరిశీలిస్తాం.

– శ్రీనివాస్, ఎస్ఈ, విజయనగరం



కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం